ఈ-పంట.. తీవ్ర జాప్యమంట

- జిల్లాలో 41.4 శాతమే నమోదు
- పెండింగ్‌లో 3,85,436 ఎకరాలు

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే: అసలే ఎల్‌నినో.. వర్షాలు లేక పంటలు దిక్కుతోచని స్థితికి చేరుకుంటున్నాయి. ఈ క్రమంలో రైతులకు మేలుచేసేందుకు పంటలను ఈకేవైసీ చేయించాలని ప్రభుత్వం సూచించింది. కానీ జిల్లాలో ఈ ప్రక్రియ పూర్తిగా వెనుకబడింది.

24 మండలాల్లో 50 శాతం దాటలే..

- ఈ-పంట నమోదు గడువు 15 రోజుల్లో ముగియనుంది.
- జిల్లాలో 28 మండలాలకు నాలుగుచోట్ల మాత్రమే 50 శాతం దాటింది.
- శాంతిపురంలో అత్యల్పంగా 28.9 శాతం, ఐరాలలో 31.6, రామకుప్పం 32.7, పలమనేరు, పెనుమూరు 34.1, పూతలపట్టు 34.4, చిత్తూరు గ్రామీణం, పులిచెర్ల 36.6, గుడిపల్లె 36.8, ఎస్‌ఆర్‌పురం 37.8, బైరెడ్డిపల్లె 38.0, రొంపిచెర్ల 38.4, గుడిపాల 39.5, గంగాధరనెల్లూరు 39.6, యాదమరి 40.1 శాతానికి పరిమితమయ్యాయి.
- తవణంపల్లె, కార్వేటినగరం, విజయపురం మండలాలు 50 శాతం దాటగా బంగారుపాళ్యం అత్యధికంగా 74.4 శాతంతో అగ్రస్థానంలో ఉంది.

35 శాతమే సాగు..

ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన అన్ని రకాల పంటలతోపాటు బీడు, వ్యవసాయేతర భూములకు ఈ-పంట నమోదు తప్పనిసరి చేసింది. జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు 44,267 హెక్టార్లు కాగా.. 15,656 హెక్టార్లు (35 శాతం) సాగైంది. వీటికి ఇంకా పంట నమోదుపూర్తికాలేదు. భూకమతాలకు సంబంధించి సర్వే నంబర్ల వారీగా మొత్తం పొలాల నమోదు సెప్టెంబరు 15లోపు పూర్తి చేయాల్సి ఉంది.

ఈకేవైసీ పరిస్థితి

పంటల సాగు:	7,06,475
నమోదు:	3,21,029
ల్యాండ్ పార్సిల్స్ (సర్వే నంబర్లు):	13,01,720
ఇప్పటివరకు నమోదు:	5,18,279
శాతం:	41.4

మామిడి, రెవెన్యూ సమస్యలతో..

తోతాపురి మామిడి రైతుల వివరాల సేకరణ, నమోదుతో పాటు గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో తలెత్తిన జాయింట్ ఎల్పీఎం సమస్యలతో ఈ పంట నమోదులో జాప్యం జరుగుతున్నట్లు ఆర్ఎస్కేల సహాయకులు చెబుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తేనే గడువులోగా నమోదు పూర్తవుతుంది.

90 శాతం వైకల్యం.. చేయూత శూన్యం

ఈ చిత్రంలో కనిపిస్తున్న బాబు పేరు పార్థివ్‌చౌదరి. అతడ్ని ఎత్తుకుంది తండ్రి జ్యోతిశ్వరనాయుడు. వీరిది పెనుమూరు మండలం చెరువు ముందర ఊరు (గుత్తావాండ్ల ఊరు). ఆరేళ్ల పార్థివ్‌చౌదరి దివ్యాంగుడు. తండ్రి ప్లంబింగ్ పనులు చేస్తారు. తల్లి రాధ ఇంటి వద్దే ఉంటు పార్థివ్‌కు సపర్యలు చేస్తుంటారు. కరోనా సమయంలో కుమారుడి కాళ్లు, చేతులు బిగుసుకుపోయాయి. బెంగుళూరు, చెన్నై, వేలూరు, తిరుపతి ఆసుపత్రుల్లో చూపించినా ఫలితం లేదు. ప్రస్తుతం 90 శాతం దివ్యాంగుడిగా మారి మంచానికే పరిమితమైనా పింఛను రావడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. 8 నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నట్లు చెప్పారు. సోమవారం అర్జీ ఇవ్వడానికి తండ్రి కుమారుడిని ఇలా భుజంపై మోసుకుంటూ కలెక్టరేట్‌కు వచ్చారు.

- ఈనాడు, చిత్తూరు

కట్టలిస్తే కట్టబెడతాం

అక్రమార్కులకు సహకరిస్తున్న సబ్ రిజిస్ట్రార్లు, సిబ్బంది ● ఒకే ఆస్తి ఇద్దరు, ముగ్గురికి రిజిస్ట్రేషన్

- తిరుపతి నగరం చెన్నాయగుంటలో 563.8 చదరపు గజాల స్థలం 2013 నుంచి చిచ్చిలి అరుణమ్మ పేరుతో ఉండగా ఈ ఏడాది భరత్‌రెడ్డి పేరుతో రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. విక్రయ దస్తావేజు వెనుక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు ఎండార్స్‌మెంట్‌లో ముద్రించిన ఫొటో, సంతకం అరుణమ్మది కాకపోయినా రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. సంబంధిత సబ్ రిజిస్ట్రార్, డాక్యుమెంట్ రైటర్‌తోపాటు మరికొందరిపై తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేశారు. 2024లో కూడా ఇదే తరహాలో జరిగిన డబుల్ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో గతవారం ఆరుగురు అరెస్టు అయ్యారు. ఇక్కడ కూడా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారుల ప్రమేయం ఉందని తేలింది.

- వైకాపా హయాంలో చిత్తూరు నగరంలో రూ.58 కోట్ల విలువైన ఎనిమిది స్థలాలను నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే వ్యక్తులతోపాటు శ్రీధర్ గుప్తా అనే సబ్ రిజిస్ట్రార్‌ను అప్పట్లో అరెస్టు చేశారు. ఇందులో రెవెన్యూ అధికారులకూ హస్తం ఉండటంతో వారినీ జైలుకు పంపారు.

తిరుపతి జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇటీవల సోదాలు చేసిన అనిశా అధికారులు

ఈనాడు- చిత్తూరు, తిరుపతి: జిల్లాలోని కొందరు సబ్ రిజిస్ట్రార్లు, ఆ కార్యాలయ సిబ్బంది కాసుల వేటలో పడి ఒకే ఆస్తిని ఇద్దరు-ముగ్గురికి రిజిస్ట్రేషన్ చేసేందుకు అక్రమార్కులకు సహకరిస్తున్నారు. కోరినంత డబ్బులు ఇస్తే చాలు ఏ స్థలమైనా ఎవరికైనా కట్టబెడతామన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. దాంతో తమ ఆస్తులకు రక్షణ లేకుండా పోతోందన్న భయం ప్రజలను వెంటాడుతోంది. ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినప్పుడు నిబంధనల ప్రకారమే రిజిస్ట్రేషన్ చేశామని సమాధానమిస్తున్నారు. లోతుగా విచారించినప్పుడు వీరి పాత్ర బయటపడుతున్నా పెద్దగా చర్యలు లేకుండా పోతున్నాయి. ఇంక్రిమెంట్లు, పెన్షన్ ప్రయోజనాల్లో నామమాత్రపు కోత పడుతుండటంతో మరోసారి ఇలాంటి తప్పిదాలకు పాల్పడుతున్నారు.

ఈసీలు కచ్చితంగా పరిశీలిస్తేనే

భూమిని కొనే వ్యక్తులు సైతం ఈవిషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్లి స్థానికులను విచారించాలి. ఈసీలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలి. లింక్ డాక్యుమెంట్లను చూసుకోవాలి. వ్యవసాయ భూమి అయితే వెబ్‌ల్యాండ్‌కు వెళ్లి వివరాలను నిర్ధారించుకోవాలి.

నకిలీ జీపీఏలు, ధ్రువపత్రాలు సృష్టించి

తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, చిత్తూరు నియోజకవర్గాల్లో ఆస్తుల విలువ రూ.కోట్లలో ఉంది. ఈనేపథ్యంలో కొన్ని ముఠాలు ఖరీదైన స్థలాలపై కన్నేస్తున్నాయి. కొన్నేళ్లుగా ఎలాంటి క్రయవిక్రయాలు జరగని భూములు, స్థలాల వివరాలు వీరు సేకరిస్తున్నారు.

అనంతరం సంబంధిత యజమాని ముఠాలోని వ్యక్తులకు జీపీఏ చేసినట్టు పేర్కొంటున్నారు. ఇందుకు సబ్ రిజిస్ట్రార్లు, సిబ్బంది సహకరిస్తున్నారు. ఇదేవిధంగా గతంలో స్థలం విక్రయించిన వ్యక్తి మరణిస్తే వారికి నకిలీ వారసులను సృష్టించి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారులు కూడా సహకరిస్తున్నారు. సంతకాలు, ఫొటోలు, ఆధార్‌లోని వివరాలు సరిపోలకున్నా ఈ తంతు నడిపిస్తున్నారు. తిరుపతి జిల్లాలో తిరుచానూరు, రేణిగుంట, మంగళం, అవిలాల, తదితర ప్రాంతాల్లో ఇలాంటి ఉదంతాలు వెలుగు చూశాయి. చిత్తూరులో మిట్టూరు, కట్టమంచి, మంగసముద్రం, దుర్గానగర్ కాలనీల్లోనూ బయటపడ్డాయి. దీంతో తిరుపతి నగరం, చుట్టుపక్కల భూములు, స్థలాలు కొనాలంటేనే ఒకటికి పదిసార్లు ఆలోచించుకోవాల్సి వస్తోంది. ఇందుకు రూ.5 లక్షలు- రూ.10 లక్షలు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

గ్రామీణ బంగారాలు

- రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో జయకేతనం
- అమరావతి ఛాంపియన్‌షిప్‌లో సత్తా

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మారుమూల గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో సత్తా చాటుతున్నారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహం, వ్యాయామ ఉపాధ్యాయుల శిక్షణలో క్రీడా నైపుణ్యాలను మెరుగుపరచుకుని జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడల్లో జయకేతనం ఎగురవేస్తున్నారు. తిరుపతిలో ఇటీవల జరిగిన అమరావతి ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీల్లో బైరెడ్డిపల్లె, తీర్థం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు.

ఉపాధ్యాయుల ప్రోత్సాహం..

బైరెడ్డిపల్లె మండలం తీర్థం జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నా. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఉపాధ్యాయులు ఎంతగానో ప్రోత్సహించారు. పీడీ అల్తాఫ్ శిక్షణలో క్రీడా నైపుణ్యాలను మెరుగుపరచుకున్నా. తిరుపతిలో ఇటీవల జరిగిన అమరావతి ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొని ప్రథమ స్థానం సాధించా. బంగారు పతకం సాధించడం ఎంతో ఆనందంగా ఉంది.

– ప్రత్యూష, 10వ తరగతి, జడ్పీఉన్నత పాఠశాల, తీర్థం

జావెలిన్‌త్రోలో ప్రతిభ

నాది బైరెడ్డిపల్లె. పలమనేరులోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నా. తిరుపతిలో ఆగస్టు 27, 28, 29 తేదీల్లో జరిగిన అమరావతి ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీల్లో జావెలిన్‌త్రో అండర్-17 విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించా. జావెలిన్‌త్రో, వాలీబాల్, బేస్‌బాల్, ఫుట్‌బాల్ ఆటల్లో నిరంతర సాధన చేస్తున్నా. క్రీడల్లో చక్కగా రాణించి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని శ్రమిస్తున్నా.

– ఫరాజ్, ఇంటర్ విద్యార్థి, బైరెడ్డిపల్లె

జాతీయస్థాయిలో గుర్తింపు

బైరెడ్డిపల్లె మండలం తీర్థం జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నా. ఖోఖో ఆటలో నైపుణ్యాలను మెరుగుపరచుకుని విజయాలు సాధిస్తున్నా. ఇటీవల తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో బంగారు పతకం కైవసం చేసుకున్నా. ఈ ఏడాది జనవరి 22న ఏలూరులో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ప్రథమ బహుమతి సాధించా. హరియాణాలో జరిగిన జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొని ప్రోత్సాహక బహుమతి అందుకున్నా. ఖోఖోలో జాతీయస్థాయి క్రీడాకారిణిగా గుర్తింపు తెచ్చుకోవాలని పరిశ్రమిస్తున్నా. – యశ్వంతి, 9వ తరగతి, జడ్పీఉన్నత పాఠశాల, తీర్థం

ఈసారీ కందిపప్పు లేదు

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: బియ్యం కార్డుదారులకు మంగళవారం నుంచి సెప్టెంబరు నెలకు సంబంధించిన నిత్యావసర సరకుల పంపిణీ ప్రారంభం కానుంది. జిల్లాలో 4.79 లక్షల బియ్యం కార్డులున్నాయి. లబ్ధిదారులకు బియ్యం, చక్కెర అందజేయనున్నారు. ఈ నెలలోనూ కందిపప్పు పంపిణీ మాటే లేదు. ప్రస్తుతం కిలో పప్పు రూ.130-150 మధ్య పలుకుతోంది. పేద, నిరుపేదలు కొనలేని విధంగా మారింది.

స్వర్ణరథ విహారి.. శరణు శరణు

సంకటహర చతుర్థి పురస్కరించుకొని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారు ఉభయదేవేరులైన సిద్ధిబుద్ధి సమేతుడై స్వర్ణరథాన్ని అధిరోహించి ఆలయ మాఢవీధుల్లో విహరిస్తూ సోమవారం రాత్రి భక్తులను మంత్రముగ్ధులను చేశారు. ఉత్సవమూర్తులకు ఆస్థానమండపం వేదిక వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, గణేశ నామస్మరణ నడుమ ఊరేగించారు. ఆలయ సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, రవి, భక్తులు పాల్గొన్నారు. - **న్యూస్‌టుడే, కాణిపాకం**

కోలాట ప్రదర్శనలో భక్తులు

స్వర్ణరథంపై సిద్ధిబుద్ధి సమేత వినాయకుడు

ఓటు హక్కుకు 11,844 దరఖాస్తులు

ముగిసిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ గడువు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ గడువు గత నెల 30న ముగిసింది. కొత్తగా ఓటు హక్కు పొందాలనుకున్న వారు ఫారం-6, జాబితాలో నుంచి అనర్హుల పేర్లు తొలగించడానికి ఫారం-7, చిరునామాలు, పేర్లు, చరవాణి నంబర్లు సహా ఇతర మార్పులు, చేర్పులు, తప్పుల సవరణకు ఫారం-8 ద్వారా ఎన్నికల సంఘానికి దరఖాస్తులు అందాయి.

- జిల్లాలో ఓటు హక్కు కోసం కొత్తగా 11,844 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 8,300 విచారణ పెండింగ్‌లో ఉండి. సెప్టెంబరు 28లోగా పూర్తిచేసి అర్హుల పేర్లు అక్టోబరు 3న విడుదల చేసే తుది జాబితాలో చేరుస్తారు.
- వివరాల సవరణ కోసం ఫారం-8 దరఖాస్తులను 7,524 మంది సమర్పించారు. 5,481 దరఖాస్తులు విచారణలో ఉన్నాయి.
- ముసాయిదా జాబితా విడుదలయ్యాక ఓట్ల తొలగింపు కోసం ఫారం-7 ద్వారా 461 దరఖాస్తులు వచ్చాయి. 383 పెండింగ్‌లో ఉన్నాయి.
- హేతుబద్ధీకరణ ద్వారా జిల్లాలో అదనంగా 197 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. గతంలో 1,511 కేంద్రాలుండగా.. ఆ సంఖ్య 1708కి చేరింది.

1.10 లక్షల మంది విచారణ

మ్యాపింగ్ కాని, వివరాలు తప్పుగా/ అనుమానాస్పదంగా ఉన్న 1,34,307 మంది ఓటర్లకు బీఎల్‌వోలు నోటీసులు జారీచేశారు. గత నెల చివరి నాటికి 1,10,580 మంది ఓటర్లు అధికారుల ముందు విచారణకు హాజరయ్యారు. ఈ ప్రక్రియ జిల్లాలో 82.33 శాతం పూర్తయింది. నోటీసులు అందుకున్న ఓటర్లు సమర్పించిన ఆధారాలను ఐదు రోజుల్లోపు పరిశీలించి తహసీల్దారు కార్యాలయంలో సిబ్బంది ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. విచారణలో తగిన ధ్రువపత్రాలు ఇచ్చి ఇప్పటివరకు లక్ష మంది తిరిగి ఓటర్లుగా అర్హత పొందారు. 1,133 మంది అనర్హులుగా గుర్తించారు.

ప్రజాసమస్యలు పరిష్కరించాలి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో 230 మంది వినతులు అందజేశారు.

ఉద్యోగం కావాలా.. ఉపాధి కార్యాలయం ఉందిగా

చిత్తూరులో ఇటీవల జరిగిన జాబ్‌మేళాకు హాజరైన యువత

పుత్తూరు, న్యూస్‌టుడే: పదో తరగతి మొదలు ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, ఇంజినీరింగ్ తదితర కోర్సులు చదివి ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నారా.. సమాచారం తెలియక ఇబ్బంది పడుతున్నారా.. అయితే మీ కోసమే జిల్లా ఉపాధి కార్యాలయం, నేషనల్ కెరీర్ సర్వీసు సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నాయి.

నమోదు సులభం..

నిరుద్యోగులు జిల్లా ఉపాధి కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవడం సులభతరం చేశారు. విద్యార్హతల ధ్రువపత్రాలను ఆయా జిల్లాల కార్యాలయాలకు తీసుకువెళ్లాలి. nc.gov.in, nypunyam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయొచ్చు. ఈ ప్రక్రియ పూర్తయితే అభ్యర్థుల చరవాణులు, ఈ మెయిళ్లకు ఉద్యోగ మేళాల సమాచారం పంపిస్తారు. employment.ap.gov.in వెబ్‌సైట్‌లోనూ సమాచారం పొందుపరుస్తారు.

- తిరుపతి జిల్లాలో 2025 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 వరకు 10,184 మంది నమోదు చేసుకున్నారు. ఇప్పటివరకు 34 ఉద్యోగ మేళాలు నిర్వహించారు. 467 కంపెనీలు పాల్గొన్నాయి. 5,158 మందికి ఉద్యోగాలు లభించాయి.
- చిత్తూరు జిల్లాలో 5034 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారు. 339 కంపెనీలు ఉద్యోగ మేళాలు నిర్వహించాయి. 3,070 మందికి ఉద్యోగాలు కల్పించారు.

తరచూ మేళాలు..

చదువు లేకపోయినా, పది, ఆపై కోర్సులు చదివిన వారు ఉపాధి కార్యాలయంలో పేర్లు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీల సమాచారం తెలియజేయడంతో పాటు ప్రైవేటు సంస్థలు ఉద్యోగ నియామకాలకు తరచూ జాబ్ మేళాలు నిర్వహిస్తున్నారు.

ఎప్పటికప్పుడు సమాచారం..

నిరుద్యోగ యువతకు సిటిజన్ చార్టర్ ప్రకారం సేవలు అందిస్తాం. అభ్యర్థుల పేర్లు, నవీకరణ, అదనపు అర్హతల నమోదు ప్రక్రియ నిరంతరం జరుగుతుంది. నేషనల్ కెరీర్ సర్వీస్ పథకం ద్వారా వచ్చే సమాచారాన్ని నిరుద్యోగులకు అందిస్తున్నాం.

– పద్మజ, ఉపాధి అధికారిణీ, ఉమ్మడి చిత్తూరు జిల్లా

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-1, నారాయణగిరి షెడ్లలో వేచిఉన్నారు. వీరికి 10 గంటల్లో, రూ.300 టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభిస్తోంది. శ్రీవారిని ఆదివారం 81,687 మంది భక్తులు దర్శించుకోగా హుండీ కానుకలు రూ.4.36 కోట్లు లభించాయి.

104FM Tirupati

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact

8008555167, 9154991499

రైతేరాజు 6

శ్రీ పోతుగుంట గోవిందప్ప నాయుడు గారికి

90వ జన్మదిన శుభాకాంక్షలు

కుటుంబ సభ్యులు మరియు బంధు మిత్రులు

+91 99080 01879

(c) eenadu

పూల రైతులకు సిరులు

పుంగనూరు, న్యూస్‌టుడే: పుంగనూరు, మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి నియోజకవర్గాల్లో పూల తోటలతో రైతులు లాభాలు గడిస్తున్నారు. పుంగనూరు నియోజకవర్గంలో కొన్నేళ్లుగా సాగు చేస్తున్నారు. బంతి, చామంతి, కనకాంబరం, లిల్లీ, రోజా, మల్లెల సాగువైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. చామంతి, బంతి పూలను ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసినా కనకాంబరం, లిల్లీ పూల తోటలు తక్కువ విస్తీర్ణంలోనే సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పండుగల రోజులు కావడంతో పూల ధరలకు రెక్కలొచ్చాయి. గత నెలతో పోల్చుకుంటే ప్రస్తుతం ధరలు ఆశాజనకంగా ఉన్నాయి.

పెరిగిన ధరలు: వర్షాలు కురవక పోవడంతో పొరుగు రాష్ట్రాల్లో చామంతి, బంతిపూల తోటలు దెబ్బతిన్నాయి. దీనికి తోడు పండగ రోజుల్లో ధరలు ఆశాజనకంగా ఉంటాయని రైతులు ఊహించిన విధంగానే ఈ ఏడాది ధరలు ఉన్నాయి. వినియోగానికి తగ్గట్టు దిగుబడులు ఉండకపోవడంతో ధరలు అనూహ్యంగా పెరిగాయి.

తోటల దగ్గరకే వ్యాపారులు: పూల ధరలు పెరుగుతున్నందున వ్యాపారులు తోటల దగ్గరకే వెళ్లి తోటల్లోనే కొనుగోలు చేస్తున్నారు. రైతులు సైతం లాభం అధికంగా ఉండడంతో విక్రయిస్తున్నారు. మరికొందరు రైతులు కూలీలను, ఇంటి మనుషులను ఉపయోగించుకుని కోసి మార్కెట్లకు తరలిస్తుండడంతో మరింత ఆదాయాన్ని పొందుతున్నారు.

600హెక్టార్ల లక్ష్యం: ఈ ఏడాది జిల్లాలో 600 హెక్టార్లలో పూల తోటల సాగు లక్ష్యం కాగా 530 ఎకరాల్లో సాగయ్యాయి. మల్చింగ్, సాగు ఖర్చులు పెరగడం, వర్షాలు లేక పోగా అన్న వర్గాల వారికి రాయితీ వర్తించక పోవడంతో రైతులు మొగ్గు చూపడం లేదు. దీంతో బంతి, చామంతి, సన్నమల్లెలు, రోజా, లిల్లీ, మల్లెలు, కనకాంబరం సాగు చేశారు.

జిల్లాలో పూలతోటల సాగు.. దిగుబడులు, ధరల వివరాలు..

పూల రకం	సాగు (ఎకరాల్లో)	దిగుబడులు (టన్నుల్లో)	ధర (కిలో)
బంతి	195	2700	55
రోజాపూలు	46	220	300
కనకాంబరాలు	9	10	1500
చామంతి	241	2650	200
లిల్లీ	102	510	300

ప్రశ్న జవాబు

రేణిగుంట, న్యూస్‌టుడే: ప్రశ్న: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కొత్త రైతు యాప్ పేరేమిటి? దాని ఉపయోగాలు తెలపండి? **- సుధాకర్‌నాయుడు, రైతు, డీపీకండ్రిగ,రేణిగుంట మండలం**

జవాబు: ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్ ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉంది. ఇందులో పొలం విస్తీర్ణం, సర్వే నెంబరు సమాచారం, వర్షం, వాతావరణ అప్‌డేట్లు, నేల ఫర్టిలిటీ నివేదిక, ముందస్తు చీడపీడలు, పంట సాగు, రాయితీ పథకాల వివరాలు, మార్కెట్ ధరల సూచనలు వ్యవసాయ శాఖ వారు రైతులకు నేరుగా తెలియ చేస్తారు.

- సునీల్‌కుమార్, ఏవో

సమీకృతం.. జీవాలకు శ్రేయస్కరం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: వర్షా కాలం నేపథ్యంలో జీవాల పెంపకం దారులు గొర్రెలు, మేకలకు సమీకృత ఆహారాన్ని అందుబాటులో ఉంచడం ఎంతో శ్రేయస్కరం. వర్షాల సమయంలో మేతకు వెళ్లేందుకు వీలుండని పరిస్థితి. అలాంటి సమయాల్లో పోషకాల సమీకృత ఆహారాన్ని దాణాగా వేయడంవల్ల పోషక శక్తిని పెంచుకోగలవు. దీన్ని పెంపకం దారులు స్వయంగా తయారు చేసుకోవచ్చు. మొక్కజొన్న, గోధుమ తవుడు, మినప, కంది, పెసర పొట్టు, వేరుసెనగ చెక్క, లవణ మిశ్రమం తగిన మోతాదులో సిద్ధం చేసుకుని తద్వారా పోషకాలు కల్గిన ఆహారాన్ని సిద్ధం చేసుకోవచ్చు. వీటి వాడకం ద్వారా కలిగే ప్రయోజనాలు అపారమనే చెప్పాలి.

❖ జీవాలకు నిర్దేశిత మోతాదు ప్రకారం సమీకృత ఆహార పదార్థాలు సరైన పాళ్లల్లో అందుతాయి. ❖ మేత వృథా అయ్యే అవకాశం ఉండదు. ❖ తేలిగ్గా జీర్ణం చేసుకునే వీలుండటంతో అజీర్ణ సమస్యలు తలెత్తవు. ❖ దాణా ఖర్చు 15 నుంచి 20 శాతం మేర తగ్గే అవకాశం ఉంటుంది ❖ జీవాల్లో ఆశించిన విధంగా ఎదుగుదల ఉంటుంది. ❖ అనారోగ్య సమస్యలను తట్టుకునే శక్తి పెంపొందుతుంది ❖ ఎలాంటి రసాయనాలు కలిసే అవకాశం లేక పోవడంతో జీవాలు మరింత ఎదుగుదలతో వృద్ధి చెందగలవు.

- డాక్టర్ గోవిందభాస్కర్, సహాయ సంచాలకులు, పశు సంవర్ధక శాఖ, శ్రీకాళహస్తి

రైతేరాజు: కాలి బాటలు.. అధిక దిగుబడులు

పుత్తూరు, న్యూస్‌టుడే: రైతులు వరి సాగులో మెలకువలు పాటిస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని పుత్తూరు వ్యవసాయాధికారి కోదండయ్య తెలిపారు. అదనపు ఖర్చు అని భావించకుండా పంటలో కాలిబాటలు ఏర్పాటు చేసుకుంటే లాభాలు పొందవచ్చు. ఖరీఫ్ సాగులో కాలిబాటలు వేయడానికి ఎకరానికి సుమారు రూ.300 నుంచి రూ.500 వరకు వ్యయమవుతుందన్నారు. వీటి పక్కనున్న దుబ్బులు మూడు, నాలుగు పిలకలు అధికంగా వేయడంతో పాటు ఎకరానికి మూడు నుంచి నాలుగు బస్తాల వరకు దిగుబడి పెరుగుతుందన్నారు.

❖ ప్రతి రెండు మీటర్లకు ఒక అడుగు వెడల్పున గట్ల పక్క నుంచి ఒక అడుగు ఖాళీ ఉండేలా వరి నాట్లు వేసి కాలిబాటలు వేయాలి. మొదళ్లకు గాలి, వెలుతురు బాగా తగిలి చీడపీడలు త్వరగా ఆశించకుండా ఉంటాయి. బాటలకు ఇరువైపులా ఉన్న వరి కుదుర్లను అధికంగా దుబ్బులు కడతాయి. నిత్యం రైతులు బాటల వెంబడి నడుస్తూ పంటలో తెగుళ్ల గుర్తించడానికి, కలుపు మొక్కలు ఏరివేయడానికి వీలవుతుంది. ఎరువులు సక్రమంగా చల్లుకోవచ్చు. పంటలో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలంటే అవసరముంటే ముందుగా తెగులు సోకిన చోట మందులు పిచికారీ చేసి తర్వాత మిగిలిన చోట చేయొచ్చు. బాటల వెంబడి ఎలుకల నివారణకు చర్యలు చేపట్టడానికి వీలుంటుంది.

తిరుమలకు బ్రహ్మోత్సవ శోభ

తిరుమల, న్యూస్‌టుడే: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి ఏడాది పొడవునా నిర్వహించే ఉత్సవాల్లో బ్రహ్మోత్సవాలు అత్యంత ప్రధానమైనవి. అధికమాసం కారణంగా ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు భక్తులను అలరించనున్నాయి. చాంద్రమానం ప్రకారం ప్రతి మూడోఏట అధికమాసం వస్తుంది. ఇలా వచ్చిన సందర్భాల్లో కన్యామాసం (భాద్రపదం)లో వార్షిక బ్రహ్మోత్సవాలు, దసరా నవరాత్రుల్లో (ఆశ్వయుజం)లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ రెండు బ్రహ్మోత్సవాలకు పెద్దతేడా లేదుగానీ, నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవు. ఈ ఏడాది అధికమాసం ఉన్న కారణంగా సెప్టెంబరు 15 నుంచి 23వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల (వార్షిక) బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 12 నుంచి 20వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఉదయం వాహన సేవ 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి వాహన సేవ 7 నుంచి 9 గంటల వరకు జరుగుతుంది. గరుడ వాహనసేవ సాయంత్రం 6.30 నుంచి 12 గంటల వరకు జరుగుతుంది.

శ్రీవారి ఆలయం (పాతచిత్రం)

అంకురార్పణం

వైఖానస ఆగమంలోని క్రతువుల్లో అంకురార్పణం లేదా బీజవాపనం అత్యంత ముఖ్యమైంది. కార్యక్రమం ఈనెల 14వ తేదీన రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య నిర్వహిస్తారు. ఏదైనా ఉత్సవం నిర్వహించే ముందు అది విజయవంతం కావాలని కోరుతూ స్వామివారిని ప్రార్థించేందుకు దీనిని నిర్వహిస్తారు. శ్రీస్వామివారి సేనాధిపతి యైన శ్రీవిష్వక్సేనులవారు ఆలయానికి నైరుతి మూలలో ఉన్న వసంత మండపానికి ఊరేగింపుగా వెళతారు. అక్కడ భూమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి మన్నులో 9 రకాల ధాన్యాలను నాటుతారు. అంకురాలను ఆరోపింపజేసే ఈ కార్యక్రమం కాబట్టి ఇది అంకురార్పణ అయింది.

ధ్వజారోహణం

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమవుతాయి. ఈనెల 15వ తేదీ సాయంత్రం 6.21 నుంచి 6.35 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి సమక్షంలో వేదగానాల మధ్య మంగళవాయిద్యాలు మోగుతుండగా అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజాన్ని ఎగురవేస్తారు. కార్యక్రమం ద్వారా సకల దేవతలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తారు. అనంతరం వాహనసేవలు వైభవంగా ప్రారంభమవుతాయి.

కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

శ్రీవారి బ్రహ్మోత్సవాలు, ఉగాది, ఆణివార ఆస్థానం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. కార్యక్రమం ఈనెల 8వ తేదీ ఉదయం 6 నుంచి 11 గంటల వరకు జరుగుతుంది. ఈ సందర్భంగా ఆలయంలోని ఆనంద నిలయం మొదలుకొని బంగారు వాకిలి వరకు, ఉప ఆలయాలు, ప్రసాదాల పోటు, ఆలయ ప్రాంగణంలోని గోడలు, పైకప్పుతోపాటు పూజాసామగ్రిని శుద్ధి చేస్తారు.

పురాణ నేపథ్యంలో ఇలా..

శ్రీనివాసుడు వేంకటాద్రిపై వెలసిన తొలినాళ్లలోనే బ్రహ్మదేవున్ని పిలిచి లోకకల్యాణం కోసం తనకు ఉత్సవాలు నిర్వహించాలని ఆజ్ఞాపించారనేది పురాణ కథనం. ఆ ప్రకారమే శ్రీవేంకటేశ్వరుడు ఆనంద నిలయం మధ్యలో ఆవిర్భవించిన కన్యామాసం (ఆశ్వయుజం)లోని శ్రవణా నక్షత్రం నాటికి పూర్తయ్యేలా బ్రహ్మదేవుడు తొమ్మిది రోజులపాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. అందుకే ఇవి 'బ్రహ్మోత్సవాలు'గా ప్రసిద్ధిచెంది అప్పటి నుంచి నిరాటంకంగా కొనసాగుతున్నాయి.

70 గ్రామాల్లో నిరంతర త్రీఫేజ్ వెలుగులు

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: పట్టణాలతో పాటు పల్లెల్లోనూ త్రీఫేజ్ విద్యుత్తు సరఫరాకు జోరుగా అడుగులు పడుతున్నాయి. ఆర్డీఎస్ఎస్ (రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం) నిధులతో ప్రతి గ్రామంలో త్రీఫేజ్ పనులు చేస్తున్నట్లు విద్యుత్తు శాఖ కన్‌స్ట్రక్షన్ విభాగం ఈఈ భాస్కర్‌నాయుడు పేర్కొన్నారు. సోమవారం అన్నమయ్య జిల్లా చౌడేపల్లె మండలం లద్దిగం, పలమనేరు మండలంలోని మొరం, రొంపిచెర్ల పరిధిలోని కురవపల్లి, గుడిపాల మండలం కొత్తపల్లి, బొమ్మసముద్రం, బంగారుపాళ్యం కేజీ సత్రంలోని నలగాంపల్లి, మంగళపల్లి ఉప కేంద్రాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్తు లైన్లు, నియంత్రికలకు విద్యుత్తు సరఫరాను ప్రారంభించినట్లు చెప్పారు. దీంతో 70 గ్రామాలకు నిరంతరం త్రీఫేజ్ విద్యుత్తు అందనుందని చెప్పారు. జిల్లాలో ఆర్డీఎస్ఎస్ పనులు సుమారు 67 శాతం జరిగాయని, జనవరి లోపు పూర్తి చేస్తామన్నారు. డీఈఈలు మాధవరావు, జీవన్‌కుమార్, ఏఈఈ రాజా, ఆపరేషన్ విభాగం ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీసత్రం ఫీడర్‌లో విద్యుత్తు ఛార్జింగ్ యూనిట్ ప్రారంభించిన ఈఈ భాస్కర్‌నాయుడు, ఇంజినీర్లు

పుష్పపల్లకీపై ధర్మనందనుల విహారం

చంద్రగిరి, న్యూస్‌టుడే: పంచమవేద మహాభారత మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ద్రౌపదీ సమేత ధర్మనందనులు పుష్పపల్లకీపై చంద్రగిరి పట్టణ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. గత 18 రోజులుగా మహాభారత ఉత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భాగవతారిణి గీతావాణి హరికథా గానం, శ్రీవేంకటేశ్వర కళానాట్య మండలి ప్రవీణ్‌కుమార్ బృందం నాటకాలు ఆకట్టుకున్నాయి. తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి ఉభయదాతగా వ్యవహరించారు.

ఫసల్ బీమాలో 670 మంది నమోదు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఫసల్ బీమా గడువు సోమవారంతో ముగిసింది. జిల్లాలో సుమారు 2.55 లక్షల మంది రైతులున్నారు. ఈ పథకంలో వరి పంటకు 353.97 హెక్టార్లకు గాను 670 మంది రైతులు నమోదు చేసుకున్నారని వ్యవసాయ శాఖ జేడీ మురళి తెలిపారు. రైతులు ప్రీమియం కింద రూ.5,45,411 చెల్లించారన్నారు. పంట నష్టపోతే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పరిహారంగా రూ.2.87 కోట్లు జమ కానున్నట్లు చెప్పారు.

పురస్కార గ్రహీతకు అభినందనలు

పలమనేరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం నుంచి ఇటీవల తెలుగు భాషా పురస్కారాన్ని అందుకున్న పుష్పను కలెక్టర్ సుమిత్ కుమార్ అభినందించారు. సోమవానం తన కార్యాలయంలో ఆమెకు ప్రభుత్వం ఇచ్చిన జ్ఞాపికను తన చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఆమె భర్త తులసినాథంనాయుడు పాల్గొన్నారు.

తులసినాథంనాయుడు దంపతులను అభినందిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్‌కు 31 ఫిర్యాదులు

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్‌కు 31 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ తుషార్‌డూడీ వాటిని స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. ఆయా ఠాణాల పోలీసు అధికారులతో మాట్లాడి, పరిష్కారాలు చూపాలన్నారు. కుటుంబ సమస్యలు 10, భూములవి 12, నగదు 3, గొడవలు 5, పోలీసు సేవలు 1 చొప్పున 31 ఫిర్యాదులు అందాయి. ఏఎస్పీ షాను, అధికారులు పాల్గొన్నారు.

బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్‌డూడీ

భవిష్యత్తు తరాలకు మార్గదర్శకాలు

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: ప్రతినిత్యం శ్రీవారి సేవలో, భక్తుల అవసరాలను తీర్చడంలో సుదీర్ఘకాలం దేవస్థానంలో అంకితభావంతో సేవలందించి, ఉద్యోగ విరమణ పొందుతున్న ఉద్యోగుల అనుభవాలు సంస్థకు ఎంతో విలువైనవని, వారి సేవానుభవాలు భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని తితిదే ఈవో ముద్దాడ రవిచంద్ర పేర్కొన్నారు. స్థానిక మహతి కళాక్షేత్రంలో సోమవారం 16 మంది ఉద్యోగ విరమణ ఉద్యోగులకు సామూహిక సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తితిదేలో విధులు నిర్వహించిన ఉద్యోగులు తమ సేవా కాలంలో ఎదుర్కొన్న ముఖ్యమైన సంఘటనలు, సవాళ్లు, వాటిని అధిగమించిన విధానాలు, విధి నిర్వహణలో పొందిన అనుభవాలను నోట్ రూపంలో సిద్ధం చేసి సహచర ఉద్యోగులతో పంచుకోవాలని సూచించారు. ఉద్యోగ విరమణ పొందే రోజే ఉద్యోగులకు అందాల్సిన అన్ని ప్రయోజనాలు వారి ఖాతాల్లో జమ అయ్యేలా కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జేఈవో ప్రభల గోపీనాథ్, డిప్యూటీ ఈవోలు గోవిందరాజన్, లోకనాథం, ఆనందరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగిని సన్మానిస్తున్న ముద్దాడ రవిచంద్ర, జేఈవో గోపీనాథ్

SWAYAMBHU SRI VARASIDDI VINAYAKA SWAMI DEVASTHANAM, KANIPAKAM (V)-IRALA (M)-CHITTOOR DISTRICT

E-procurement Short Tender Notice

Rc.No.Q1/99 /2022 Dated:30.08.2026

Inviting Tenders from the Registered Contractors and Registered firms for the Developmental works in the premises of Devasthanam, Kanipakam.

E-procurement registered Contractors are requested to download the Tender Bid & BOQ from https://tender.apeprocurement.gov.in tenders site. For further details Contact Ph: 08573-281747.

1. Bid Document Download Starting Date: 02.09.2026 1.00 p.m, 2. Bid Document Download Ending Date: 09.09.2026 1.00 p.m, 3. Last Date & Time for Receipt of Bids: 09.09.2026 1.30 p.m. 4. Technical Bid Opening Date:09.09.2026 2.00 p.m, 5. Price Bid Opening Date: 09.09.2026 3.00 p.m.

Sd/- K.Penchala Kishore, Executive Officer & Spl.Grd.Deputy Collector

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని పలువురు ప్రముఖులు సోమవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారి మూలమూర్తిని కర్ణాటక ఎంపీ జైరాం రమేష్, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, కాంగ్రెస్ మాజీ మంత్రి చింతామోహన్, సాయంత్రం వేళలో దర్శకుడు భరత్ దర్శించుకున్నారు.

శ్రీవారి ఆలయం ఎదుట కర్ణాటక ఎంపీ జైరాం రమేష్ తదితరులు ✤ ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి కుటుంబం ✤ దర్శకుడు భరత్ కుటుంబం

ఆహారభద్రతలో బాధ్యతగా వ్యవహరించాలి

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలోని హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో భక్తులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని తయారుచేసి వారి ఆహార భద్రతపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి అన్నారు. బ్రహ్మోత్సవాలు రానున్న నేపథ్యంలో హోటళ్ల నిర్వాహకులతో స్థానిక ఆస్థాన మండపంలో సమావేశం నిర్వహించారు. హోటల్ పరిశుభ్రత, ఫుడ్ ప్రాసెసింగ్‌పై రెండేళ్లుగా యాజమాన్యాలకు, నిర్వాహకులకు అనేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఇకపై ప్రతినెలా కనీసం 10 నుంచి 15 శాంపిళ్లను అధునాతన ల్యాబ్‌లో పరీక్షిస్తామని చెప్పారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలకు వ్యతిరేకంగా ఫలితాలు వస్తే రూ.5 లక్షల జరిమానా, కేటాయించిన దుకాణాన్ని సీజ్ చేయడం వంటి చర్యలు చేపడతామన్నారు. కేటాయించిన స్థలాన్ని దాటి ఆక్రమణలకు పాల్పడరాదని, తినుబండారాలను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని స్పష్టం చేశారు. హోటల్ కార్మికుల కోసం వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. అంతకుముందు ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారి జగదీష్ తిరుమలలో హోటల్ నిర్వాహకులు పాటించాల్సిన నియమ నిబంధనలను వివరించారు. తితిదే ఎస్టేట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఆరోగ్యశాఖ డిప్యూటీ ఈవో సోమన్నారాయణ, వీజీవో సురేంద్ర పాల్గొన్నారు.

ఆపరేటర్ పోస్టుల భర్తీకి ముఖాముఖి

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: 'కౌశలం' కార్యక్రమం ద్వారా నిరుద్యోగ యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా యాక్సెలెంట్ ఫార్మాసైన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో వంద ఆపరేటర్ పోస్టుల భర్తీకి సెప్టెంబరు 3న ముఖాముఖి నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. ఐటీఐ, ఎలక్ట్రికల్ డిప్లొమా లేదా ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. అభ్యర్థులు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో హాజరుకావాలని కలెక్టర్ సూచించారు.

సంస్కృతం భారతీయ సంస్కృతికి జీవనాడి

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో వారంరోజులుగా జరుగుతున్న 'సంస్కృతోత్సవం 2026' వేడుకలు సోమవారం ముగిశాయి. చివరిరోజు ముఖ్యఅతిథిగా హాజరైన రామకృష్ణ మిషన్ తిరుపతి కార్యదర్శి స్వామి సుకృతానంద మాట్లాడుతూ, సంస్కృతం అత్యంత ప్రాచీనమైన, ఉన్నతమైన శాస్త్రీయ భాష అని కొనియాడారు. భారతీయులందరూ తప్పనిసరిగా సంస్కృత భాషను అధ్యయనం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రుషికేశ్ కైలాస ఆశ్రమానికి చెందిన మేధానంద పూరి, వీసీ ఆచార్య రాణీ సదాశివమూర్తి మాట్లాడారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రిజిస్ట్రార్ బలభద్ర ఉపాధ్యాయ, కో-ఆర్డినేటర్ డా.గిరిజాప్రసాద్, అదనపు కో-ఆర్డినేటర్ డా.కె.వి.నరసింహశాస్త్రి పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న వీసీ రాణీసదాశివమూర్తి, స్వామి సుకృతానంద

చీటింగ్ కేసులో ఇద్దరికి జైలు

ఖమ్మం న్యాయవిభాగం: మోసపూరితంగా ఇల్లు విక్రయించిన కేసులో నల్గొండ జిల్లా అనుముల మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన మేడిద మాల్యాద్రి(ఏ1), ఖమ్మం వైరారోడ్‌లోని అలహాబాద్ బ్యాంక్ మేనేజర్ కేవీఎన్ రామకృష్ణ(ఏ3)కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమశ్రేణి కోర్టు జడ్జి యేపూరి బిందుప్రియ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ ప్రకారం.. చిత్తూరులో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కాళంగి మాధవీరత్నం అక్కడే జిల్లా సమాచార అధికారిగా పనిచేస్తున్న ఆమె భర్త కిరణ్ సుధాకర్ కలిసి 2012 మార్చి 21న ఖమ్మం శ్రీరాంనగర్‌లో రూ.22 లక్షలకు మాల్యాద్రి వద్ద ఇల్లు కొనుగోలు చేశారు. రూ.20 లక్షలు అలహాబాద్ బ్యాంక్ నుంచి రుణం తీసుకున్నారు. ఒరిజినల్ దస్తావేజులు బ్యాంక్‌లో డిపాజిట్ చేశారు. అనంతరం ఆ ఇంటిని స్వాధీనం చేసుకొని అద్దెకు ఇవ్వగా 2015 మార్చి 2న ఏపీజీవీబీ ఖమ్మం శాఖ మేనేజర్ పట్నాయక్ వచ్చి సదరు ఇల్లు తమ బ్యాంక్ తనఖాలో ఉందని, వెంటనే ఖాళీ చేయాలని కిరాయిదారునికి చెప్పారు. ఆయన విషయాన్ని యజమానులకు తెలియచేయగా వారు ఖమ్మం వచ్చి ఆయా బ్యాంకుల్లో విచారించారు. రెండు బ్యాంకుల్లో సరైన సమాధానం చెప్పలేదు. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితులు ఇద్దరు బ్యాంక్ మేనేజర్లతో పాటు ఇల్లు అమ్మిన మాల్యాద్రిపై ఖానాపురం హవేలి ఠాణాలో ఫిర్యాదు చేశారు. సమగ్ర దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో ఏ1 మాల్యాద్రి, ఏ3 కేవీఎన్ రామకృష్ణపై నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పు చెప్పారు.

డ్రగ్స్ నియంత్రణకు విస్తృత తనిఖీలు

చిత్తూరు (సంతపేట), న్యూస్‌టుడే: డ్రగ్స్ నియంత్రణకు విస్తృత తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మాదక ద్రవ్యాల నియంత్రణపై సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించి ఈగల్ టోల్ ఫ్రీ నంబరు 1972, 94906 17896కు సమాచారం ఇవ్వాలన్నారు.

చిత్తూరులో '30 పోలీసు యాక్టు'

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: చిత్తూరు నగరంలో మంగళవారం నుంచి ఈ నెల ఆఖరు వరకు 30 పోలీసు యాక్టు అమల్లో ఉంటుందని చిత్తూరు ఒకటో పట్టణ సీఐ చిన్న పెద్దయ్య తెలిపారు. నగరంలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా చట్టాన్ని అమలు చేస్తున్నామన్నారు. ప్రజలు, రాజకీయ నాయకులు నిబంధనలు పాటించాలన్నారు. పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలు చేపట్టొద్దన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా భద్రత దృష్ట్యా చర్యలు చేపట్టామని, బేఖాతరు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

ఎస్పీడీసీఎల్‌లో ఉద్యోగోన్నతులు

చిత్తూరు (మిట్టూరు), తిరుపతి (జీవకోన), న్యూస్‌టుడే: ఏపీఎస్పీడీసీఎల్‌లో 40 మందికి ఉద్యోగోన్నతులు కల్పిస్తూ ఆ సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) లోతేటి శివశంకర్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో 28 మందికి, అకౌంట్స్ విభాగంలో 12 మందికి పదోన్నతులు వచ్చాయి. ఎస్ఈలుగా ఉన్న శ్రీనివాసబాబు, సుధాకర్ కుమార్‌లకు చీఫ్ జనరల్ మేనేజర్లుగా ఉద్యోగోన్నతి లభించింది. ఈఈలుగా ఉన్న శ్రీధర్, భూపతి, శ్రీనివాసులురెడ్డి, జయకృష్ణారెడ్డి, సుధాకర్, శేషాద్రి, విజయరాజు, సురేష్‌బాబులకు ఎస్ఈలుగా అవకాశం కల్పించారు. కొందరు డీఈఈలకు ఈఈలుగా, పలువురు ఏఈఈలకు డీఈఈలుగా ఉద్యోగోన్నతి వచ్చింది.

దంపతులను వెంబడించి చోరీ

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: బ్యాంకు నుంచి నగదు డ్రా చేసుకుని వెళ్తున్న దంపతులను వెంబడించి రూ.3.25 లక్షల నగదు చోరీ చేసిన ఘటన నాయుడుపేటలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై శివశంకర్ కథనం మేరకు.. చిట్టమూరు మండలం సవటపెళ్లకూరుకు చెందిన రైతు వెంకటకృష్ణయ్య, రమణమ్మ దంపతులు ధాన్యం నగదు ఖాతాలో వేయడంతో స్థానిక ఇండియన్ బ్యాంకులో నగదు తీసుకుని ద్విచక్ర వాహనంలో బయలు దేరారు. బ్యాంకు నుంచి గుర్తు తెలియని వ్యక్తులు వీరిని వెంబడించి కొంత దూరం వచ్చాక ద్విచక్ర వాహన చక్రానికి గాలిలేదని తెలిపారు. దీంతో వీరు స్థానిక రైల్వేస్టేషన్ ఎదుట ఆగి చెక్ చేయిస్తుండగా నగదు చోరీకి పాల్పడ్డారు. బాధితులు నగదు చోరీ విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై శివశంకర్, సిబ్బంది సీసీ ఫుటేజీ పరిశీలించి అక్కడ సంచరిస్తున్న కొందరి కోసం గాలిస్తున్నారు. అప్పులు తీర్చేందుకు నగదు తీసుకెళ్తుండగా చోరీ చోటు చేసుకున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి మృతి.. మరొకరి పరిస్థితి విషమం

చంద్రగిరి, న్యూస్‌టుడే: నాగాలమ్మ మలుపు సమీపంలోని వంతెన వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో యువకుడు మృతిచెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల సమాచారం మేరకు... అన్నమయ్య జిల్లా సదుం మండలంలోని చీకలచేను గ్రామానికి చెందిన పచ్చిపాల చరణ్‌కుమార్, చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలోని అయ్యప్పగారిపల్లికి చెందిన తోట కిరణ్‌కుమార్‌లు స్నేహితులు. ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంపై వెళ్తున్న వీరిని ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. తీవ్రగాయాలకు గురైన క్షతగాత్రులను వైద్యసేవల నిమిత్తం రుయాకు తరలించారు. **చరణ్‌కుమార్** (20) మృతిచెందగా తీవ్రగాయాలకు గురైన కిరణ్‌కుమార్‌ను రేణిగుంటలోని అమర ఆసుపత్రికి తీసుకెళ్లారు. యువకుడి పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

EENADU Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

హైవేకి ఆనుకొని చంద్రగిరి దగ్గర మరియు IIT దగ్గర ఎర్రచందనం చెట్లతో ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్లు కలవు డైరెక్ట్ ఓనర్, ఫోన్: 95027 74175,79959 92114.

JOBS

ఉద్యోగ అవకాశాలు కనీస అర్హత 10th ఆపై. Age:25-65Y జీ: 3,000-30,000+ ఇన్సెంటివ్స్, ఇన్సూరెన్స్, అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. 95058 50438.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

THE EENADU WAY CLASSIFIEDS

B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/-

Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే

తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు

వివరాలకు...

80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి

B/W: రూ. 600 Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

(c) eenadu

చిత్తూరు
• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ సహకరించాలని కార్మికశాఖ సహాయ కమిషనర్ ఓంకార్, సహాయ అధికారి ఆనందబాబు పిలుపునిచ్చారు. సోమవారం విద్య, పోలీసు, ఐసీడీఎస్ శాఖల అధికారులు, సిబ్బందితో పాటు ఎన్జీవో సంఘం ప్రతినిధులతో కలిసి జీడీనెల్లూరు, చిత్తూరు నగరంలో తనిఖీలు చేపట్టారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

పుత్తూరు, న్యూస్‌టుడే: నిబంధనలు ఉల్లంఘించి ట్రిపుల్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సెట్టి కిరణ్ హెచ్చరించారు. పుత్తూరులో సోమవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. 27 ఈ చలాన్ల కింద రూ.32,545 జరిమానా విధించినట్లు చెప్పారు. ప్రమాదాల నియంత్రణకు ఎన్‌హెచ్, ఆర్‌ఎస్‌పీ మొబైల్ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ వాహన తనిఖీలు చేస్తున్నామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) చిత్తూరు నగరం: 80085 74598 నగరి: 9866112017 గంగాధరనెల్లూరు: 80085 74605 పూతలపట్టు: 9505557466

? చిత్తూరు సంజయ్‌గాంధీ నగర్‌లోని కాలువల్లో వ్యర్థాలు తొలగించడం లేదు. దోమల బెడద ఎక్కువ అవుతోంది. - **స్థానికులు** ✓ దోమల నివారణకు మలాథియాన్ ద్రావణం పిచికారీ చేస్తాం. - **అనిల్‌కుమార్, నగరపాలక ఆరోగ్యాధికారి** - న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

? గోవిందరెడ్డిపల్లె పంచాయతీ గొల్లపల్లెలో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. రాత్రి వేళ ఇబ్బంది పడుతున్నాం. - **స్థానికులు** ✓ పంచాయతీ అధికారులతో మాట్లాడి వీధి దీపాలు వెలిగేలా చూస్తాం. - **హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో** - న్యూస్‌టుడే, తవణంపల్లె

తాగునీరు ఇవ్వండి మహాప్రభో

పుత్తూరు మండలం ఎగువ కనకంపాళెం పంచాయతీలోని మిట్టిగుంట ఆదిఆంధ్రవాడలో తాగునీటి కోసం 15 రోజులుగా ఇబ్బందులు పడుతున్నట్లు దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు మహేష్ పేర్కొన్నారు. ఖాళీ బిందెలతో గ్రామస్థులతో కలిసి సోమవారం నిరసన తెలిపారు. సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పరిష్కారం చూపకపోతే ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తామన్నారు. - **న్యూస్‌టుడే, పుత్తూరు**

సేవలన్నీ.. మూలనే

అత్యవసర వాహనాలు అందుబాటులో లేకపోయినా, మారుమూల గ్రామాల్లో వైద్యం అవసరమైతే సులభంగా వెళ్లేందుకు నగరి ఆసుపత్రికి ద్విచక్ర వాహనం అందజేశారు. నాలుగేళ్లుగా దాన్ని వినియోగించుకుండా మూలన పడేశారు. ఇప్పటికైనా అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. తుప్పు పట్టకముందే, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు అందజేయాలని పలువురు సూచిస్తున్నారు. - **న్యూస్‌టుడే, నగరి**

గోతులతో గుబులు

విజయపురం మండలంలోని నాగలాపురం- తిరుత్తణి రోడ్డు ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఓరూరు వద్ద ఆరు నెలల వ్యవధిలో రెండు సార్లు మరమ్మతులు చేశారు. అక్కడ ప్రాంతం లోతుగా ఉండటంతో నీరు నిలిచి పాడవుతోంది. వాహనాల రాకపోకలతో రాళ్లు తేలడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డు ఎత్తు పెంచాల్సి ఉందని స్థానికులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, విజయపురం**

రూ.2 కోట్ల భవనం.. శిక్షణకు సిద్ధం

జీడీనెల్లూరు- తూగుండ్రం ప్రధాన మార్గంలో జైన్-2 మామిడిగుజ్జు పరిశ్రమ సమీపంలో రూ.2 కోట్లతో నిర్మించిన జిల్లా పంచాయతీరాజ్ శిక్షణ భవనం ప్రారంభానికి సిద్ధమైంది. అన్ని మండలాల ఎంపీడీవోలు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది, పంచాయతీరాజ్ ఇంజినీర్లకు జిల్లా కేంద్రమైన చిత్తూరులో శిక్షణ ఇవ్వనున్నారు. వివిధ రకాల సమీక్షలు నిర్వహించేలా భవనంలో సౌకర్యాలు కల్పించారు. - **న్యూస్‌టుడే, గంగాధరనెల్లూరు**

వెలిగొండ ప్రాజెక్టుతో మేలు

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: తెలుగు ప్రజల గుండెచప్పుడు వెలిగొండ ప్రాజెక్టు అని తెదేపా రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి సప్తగిరిప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం చిత్తూరు పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించడం రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయమన్నారు. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు కృష్ణా జలాలు చేరువ చేయనున్నారు. 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. తెదేపా జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, నాయకులు వినోద్‌కుమార్, మదన్, సురేష్ పాల్గొన్నారు.

కన్నికలమ్మ ఆలయంలో పూజలు

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఎల్లమరాజుపల్లె గుట్టపై వెలసిన కన్నికలమ్మ దేవత ఆలయంలో సోమవారం వార్షిక పూజలు నిర్వహించారు. మహిళలు పూజా సామగ్రి, పొంగళ్లతో గుట్టపైకి చేరి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు.

దాతకు విరాళం బాండు అందిస్తున్న సూపరింటెండెంట్ వాసు

నిత్యాన్నదాన పథకానికి విరాళం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన వెంకట శివప్రసాద్ రెడ్డి రూ.1,00,116 మొత్తాన్ని ఆలయ సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడుకు సోమవారం అందజేశారు. దాత, కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందించారు. ● శ్రీవరసిద్ధి వినాయక స్వామిని తితిదే పాలక మండలి సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ ప్రోటోకాల్ ఏఈవో ధనపాల్, అర్చకులు రాజగోపురం వద్ద వారికి స్వాగతం పలికారు. మూలమూర్తి దర్శన అనంతరం స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు.

మొర వినండి.. కనికరం చూపండి

సమస్యలపై అర్జీదారుల ఆవేదన

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: మండల స్థాయిలో మా సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని, కాళ్లరిగేలా తిరుగుతున్నా కనికరం చూపడం లేదని అర్జీదారులు వాపోయారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులు సమర్పించారు. ఉన్నతాధికారులు మా మొర ఆలకించి.. సమస్యలకు పరిష్కారం చూపాలని అర్జీదారులు విన్నవించారు.

బోర్ల ఆక్రమణ..

అంధ్రవారిపల్లె ఎస్టీ కాలనీ వాసులు

ప్రభుత్వం ఏర్పాటుచేసిన తాగు నీటి బోరును కొందరు ఆక్రమించి చుట్టూ కంచె వేశారని పూతలపట్టు మండలం అంధ్రవారిపల్లె ఎస్టీ కాలనీ వాసులు వాపోయారు. దీంతో కొన్ని రోజులుగా తాగునీటికి అవస్థలు పడుతున్నామని ఆవేదన చెందారు. ● తాగునీటి బోరును ఓ వ్యక్తి ఆక్రమించాడని పెనుమూరు మండలం మొరవకండ్రిగ ఎస్సీ కాలనీ వాసులు ఆరోపించారు. బోరు నీరు అతని పొలానికి మళ్లిస్తున్నా, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

అధికారులతో తిప్పలు..

మాజీ సైనికులు, సైనికుల భూ సమస్యలను పరిష్కరించడంలో రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని డిఫెన్స్ వెటరన్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు ఆవేదన చెందారు. భూ సమస్యల బాధితులతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, ఇప్పటికైనా క్షేత్ర స్థాయి సిబ్బంది సక్రమంగా పనిచేసేలా ఆదేశాలివ్వాలని కోరారు.

ఏడాదిగా తిరుగుతున్నా..

శరవణ

ఏడాది క్రితం పక్షవాతం రావడంతో ఎడమ కాలు, చేయి పడిపోయాయి. గతంలో కూలి పనులు చేసేవాడిని. ప్రస్తుతం ఇంటికే పరిమితం అయ్యా. పెళ్లి కూడా కాలేదు. నన్ను ఆదరించే వారు ఎవరూ లేరు. పింఛన్ వస్తే భరోసా ఉంటుందని ఏడాదిగా తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.
- **శరవణ, పచ్చనపల్లి, చిత్తూరు**

మరికొన్ని వినతులు

● ప్రమాదం కారణంగా దివ్యాంగుడిగా మారానని, ఎవరో ఒకరు తోడు ఉంటే తప్ప నడవలేక పోతున్నానని తవణంపల్లెకు చెందిన శివాజీ అన్నారు. ఆర్థిక పరిస్థితి బాగులేక కుటుంబం ఇబ్బంది పడుతోందని, పింఛను ఇవ్వాలని కోరారు. వైద్య ఖర్చుల కోసం అప్పులు చేస్తున్నట్లు చెప్పారు. ● 50 శాతం వైకల్యం ఉన్నా పింఛను ఇవ్వడంలేదని యాదమరి మండలం దాసరాపల్లెకు చెందిన మారియమ్మ అన్నారు. భర్త లేడని, ఇద్దరి పిల్లల పోషణకు అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. దివ్యాంగ పింఛను మంజూరు చేయాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

చిత్తూరు జడ్పీ, న్యూస్‌టుడే: జిల్లా ఎంఎస్‌జీవో/ యూఎస్‌జీవో అసోసియేషన్ నూతన కార్యవర్గం సోమవారం ఎన్నికైంది. జిల్లా అధ్యక్షుడిగా పీఎం చంద్ర, ప్రధాన కార్యదర్శిగా కేపీ నిరంజన్‌రెడ్డి, కోశాధికారిగా టీఎం విజయ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎన్.భాస్కర్‌నాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎ.ప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా కె.సౌజన్య, ఎస్.అబ్దుల్‌తస్లీం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎం.యుగంధర్, జి.రాజేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా డీడీవో రవికుమార్ వ్యవహరించారని నిరంజన్‌రెడ్డి తెలిపారు.

మాతృ మరణాల నివారణకు కృషి

చిత్తూరు (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసూతి సేవలను మెరుగుపరచి, మాతృ మరణాలను నివారించాలని డీఎంహెచ్‌వో నాగ శశిభూషణ్‌రెడ్డి సూచించారు. జూమ్ సమావేశంలో వైద్యాధికారులతో మాట్లాడారు. జులై, ఆగస్టు నెలల్లో మాతృ మరణాలు లేకుండా విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. గర్భిణులకు తొలి నుంచి పూర్తి స్థాయిలో సేవలు అందించాలన్నారు.

IN THE COURT OF THE ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) OF CHITTOOR,A.P
E.A. No.82 of 2025 in
E.P. No.14 of 2016 in
O.S. No.282 of 1997
Between:
Karavala Thanikachalam
... Petitioner/Auction Purchaser
And
1.C. Venkatamunaswamy,
...Respondents/Decree Holder
2.V.M.Kuppuswamy (Died) & others
...Respondents/Judgment Debtors
NOTICE TO
THE RESPONDENT NO.3 TO 6
To:
R.3. V.M.Gajalakshmi @ Lakshmi, W/o late V.M.Meghanatham,
R.4 V.M.Srinivasulu, S/o late V.M.Meghanatham,
R.5. V.M.Lokanatham, S/o late V.M.Meghanatham,
R.6. V.M.Annapoorna, D/o late V.M.Meghanatham,
R3 to R6 are doing Business, Residing at D.No.10-324, Upstairs, D.I.Road, Chittoor.
Sir/Madam
Please take notice that the above-named petitioner filed the above E.A. against the respondents for delivery of possession in respect of the E.A schedule mentioned property and the E.A. posted for your appearance before the Hon'ble court on 06.10.2026. Please be present on the said date before the Hon'ble court at about 10:30 AM either in person or through an advocate and to raise objections if any, failing which, the matter will be decided exparte in your absence.
Sd/- B.POORNACHANDRA
Advocate,Chittoor
Place:Chittoor, Date: 29.08.2026

వేడుకగా మహా కుంభాభిషేకం

మూలమూర్తికి హారతిస్తున్న అర్చకులు

చిత్తూరు (క్రీడలు), న్యూస్‌టుడే: చిత్తూరు నగరం గిరింపేట సమీపంలోని శ్రీనగర్ కాలనీలో వెలసిన సత్యభామ సమేత వేణుగోపాలకృష్ణ దేవస్థానంలో మహా కుంభాభిషేకం వైభవంగా జరిగింది. వేద పండితుల నేతృత్వంలో యాగ పూజలు, పూర్ణాహుతి శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటేష్, రాజేంద్రబాబు, కోదండ, మధు, గోకుల్, ప్రభాకర్, వరదరాజులు, చంద్రమ్మ, ప్రభావతి పాల్గొన్నారు.

గణపతి వ్రతం.. సకలపాపహరణం

కాణిపాకం, న్యూస్‌టుడే: సంకటహర చతుర్థి సందర్భంగా వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సోమవారం శాస్త్రోక్తంగా నాలుగు విడతల్లో సంకటహర గణపతి వ్రతాలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పాల్గొన్నారు. ● **నగరి:** నగరి పట్టణంలోని సుందర వినాయకస్వామి ఆలయంలో సోమవారం మహా సంకటహర చతుర్థి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 ప్రత్యేక కలశాలతో భక్తులు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయం వద్ద అన్నదానం చేపట్టారు. నిర్వాహకులు ముత్తు తంగవేలు, గుణశేఖర్, జ్యోతినాయుడు తదితరులు పాల్గొన్నారు. ● బగ్గఅగ్రహారంలో ఒన్నూరమ్మదేవి మహా కుంభాభిషేకం సోమవారం నిర్వహించారు. మాజీ మంత్రి ఆర్.కె.రోజా ప్రత్యేక పూజలు చేశారు.

నగరిలో కలశాలను ఊరేగిస్తున్న భక్తులు

కాణిపాకం: సామూహిక వ్రతంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా హోమాలు

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరు పట్టణం గేటుపుత్తూరులోని సిద్ధి వినాయక స్వామి ఆలయం నిర్మించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా జీర్ణోద్ధరణ పనులు చేపట్టి కుంభాభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పుత్తూరు ఏఎంసీ ఛైర్మన్ డీఎస్ గణేష్, మాజీ ఎంపీపీ ఏలుమలై, పుత్తూరు పట్టణ తెదేపా అధ్యక్షుడు జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ధనపాల్, సింగిల్ విండో అధ్యక్షుడు కరుణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణ మార్గంలో రూ.10 లక్షలతో వెలుగులు

పెనుమూరు, న్యూస్‌టుడే: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం పులిగుండు చుట్టూ వీధి దీపాల ఏర్పాటుకు రూ.10 లక్షలను కలెక్టర్ సుమిత్‌కుమార్ మంజూరు చేశారు. ఇక్కడ ప్రతినెలా పౌర్ణమి రోజున గుంటీశ్వరస్వామి గిరి ప్రదక్షిణ 4 కిలోమీటర్ల మేర జరుగుతుంది. భక్తులు భారీగా వస్తారు. కానీ విద్యుత్తు దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను స్థానిక నాయకులు పరమేశ్వరరెడ్డి, మనోహర్‌రెడ్డి ఈనెల 29న కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పర్యాటకశాఖ జిల్లా అధికారి నరేంద్ర, ఇన్‌ఛార్జి ఎంపీడీవో డిల్లీబాబు, పరమేశ్వరరెడ్డితో సోమవారం చర్చించారు. పర్యాటక శాఖ నుంచి రూ.10 లక్షలు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. మూడు వారాల్లో పనులు చేయాలని ఆదేశించారు.

పీజీఆర్‌ఎస్‌కు 11 అర్జీలు

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై అందే ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణం చర్యలు చేపట్టాలని నగరపాలక కమిషనర్ నరసింహ ప్రసాద్ సూచించారు. స్థానిక నగరపాలక కార్యాలయంలో సోమవారం పీజీఆర్‌ఎస్ నిర్వహించారు. ఇంజినీరింగ్ 8, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, పింఛను ఒక్కొక్కటి చొప్పున 11 వినతులు అందాయి. వివిధ విభాగాల అధికారులు ప్రసాద్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

సత్వరమే విద్యుత్తు సమస్యలకు పరిష్కారం.. చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: విద్యుత్తు సమస్యలను సత్వరమే పరిష్కరించాలని విద్యుత్తు శాఖ ఎస్ఈ అమరబాబు పేర్కొన్నారు. ఎస్ఈ కార్యాలయంలో సోమవారం ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు 'డయల్ యువర్ ఎస్ఈ' నిర్వహించారు. విద్యుత్తు లైన్లను మార్పులు, సరఫరాలో అంతరాయాలు, లో ఓల్టేజీ తదితర సమస్యలపై పలువురు ఫిర్యాదు చేశారు.

నేడు ఆరేటమ్మకు క్షీరాభిషేకం.. పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరు పట్టణంలోని గ్రామ దేవత ఆరేటమ్మకు ఈనెల 1న మంగళవారం ఉదయం 5 గంటల నుంచి 11 గంటల వరకు క్షీరాభిషేకం నిర్వహించనున్నారు. సాయంత్రం అమ్మవారిని పురవీధుల్లో ఊరేగిస్తారు. రాత్రి పిడికిలి గంగ జాతర చాటింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. 6న గెరిగ ఊరేగింపు, 8న మంచినీళ్ల గుంట నుంచి చాటుబండి ఊరేగింపు, 9న గంగమ్మ జాతర నిర్వహిస్తామని తెలిపారు.

నేటి నుంచి సొసైటీల ఎన్నికలు.. నింద్ర, న్యూస్‌టుడే: మండలంలోని గొర్రెల పెంపకందారుల ప్రాథమిక సొసైటీ ఎన్నికలు నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాధికారిణి సాయిసౌందర్య తెలిపారు. 1న శ్రీరామాపురం, ఐఆర్‌కండ్రిగ, 2న కొప్పేడు, పీఎస్‌కండ్రిగ, అగరం, 3న నింద్ర, కేఆర్‌పాళెంలో ఎన్నికలు ఉన్నాయన్నారు. సొసైటీలో ఓటు హక్కు కలిగిన పెంపకందారులు పాల్గొనాలని సూచించారు.

ఏఎంసీ పాలకవర్గ పదవీకాలం పొడిగింపు.. పెనుమూరు, న్యూస్‌టుడే: పెనుమూరు మార్కెట్ కమిటీ పదవీ కాలం ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత పాలకవర్గం పదవీకాలం ఆగస్టు 14తో ముగియడంతో అధికారులు చర్యలు చేపట్టారు. ఛైర్మన్‌గా ఇ.కృష్ణమనాయుడు ఆధ్వర్యంలో సభ్యులు ఆరు నెలలు సేవలు అందించనున్నారు.

బాలిక అదృశ్యంపై కేసు.. పుత్తూరు, న్యూస్‌టుడే: బాలిక అదృశ్యంపై కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పుత్తూరు పట్టణానికి చెందిన బాలిక (17) కూలి పనులకు వెళ్లి తిరిగి రాలేదని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విశ్రాంత ఎఫ్‌ఆర్వో పింఛనులో కోత

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: అటవీ శాఖ పలమనేరు డివిజన్ రేంజ్ అధికారిగా పనిచేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన జి.శివన్నపై చర్యలు చేపడుతూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్‌దండే సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2024లో వన్యప్రాణి చట్టం కేసులో వాస్తవాలను పై అధికారులకు తెలియజేయకుండా దాచి పెట్టడంతో ఆయనపై అప్పట్లో విచారణకు ఆదేశించారు. ఆరోపణలు రుజువు కావడంతో ఆయనకు వచ్చే ప్రభుత్వ నెలవారీ పింఛనులో శాశ్వతంగా 10 శాతం కోత విధిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వక్ఫ్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలకు డిమాండ్

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: వక్ఫ్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని శేషాపీర్ మసీదు ముస్లింలు డిమాండ్ చేశారు. సోమవారం మసీదు ప్రాంగణంలో నిరసన తెలిపారు. ప్రస్తుత మసీదు కమిటీ సభ్యులు, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ కలిసి ఆదాయం, ఆస్తుల విషయంలో అవకతవకలకు పాల్పడుతున్నారన్నారు. 2025లో ఇన్‌స్పెక్టర్ సమర్పించిన నివేదికలో మసీదు వార్షికాదాయం రూ.1.20 లక్షలుగా చూపారని, 2026లో ఆడిట్ నివేదికలో నెలవారీ ఆదాయం రూ.36 వేలుగా ఉండటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయనపై కేసు నమోదైనా, ఫిర్యాదులు చేసినా మార్పు రావడం లేదన్నారు. చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చిత్తూరు ట్రాఫిక్ సీఐ బదిలీ

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబును బదిలీ చేస్తూ ఎస్పీ తుషార్ డూడీ ఉత్తర్వులు జారీ చేశారు. ట్రాఫిక్ విభాగం నుంచి సైబర్ క్రైం విభాగానికి బదిలీ చేశారు. ● **ఎస్సైగా మహేష్‌బాబు..** చిత్తూరు ట్రాఫిక్ ఎస్సైగా మహేష్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వీఆర్‌లో ఉన్న ఆయనను ట్రాఫిక్‌కు కేటాయించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన ఎస్పీ తుషార్‌డూడీని కలిశారు.

మహేష్‌బాబు

నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఏపీ రజక సాధన కోర్ కమిటీ సభ్యులు షణ్ముగం డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. షణ్ముగం మాట్లాడుతూ.. 18 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో రజకులు ఎస్సీ కేటగిరీలో ఉన్నారని, ఏపీలో బీసీ జాబితాలో చేర్చారన్నారు. నాయకులు సోమశేఖర్, వనజ, మోహనవల్లి, నాగరాజు, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

రమాదేవి సేవలు అభినందనీయం

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరు ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ అధ్యాపకురాలిగా పని చేసిన రమాదేవి సేవలు అభినందనీయమని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఆమెను కళాశాలలో సోమవారం సత్కరించారు. 35 ఏళ్లపాటు రమాదేవి వివిధ కళాశాలల్లో పని చేశారన్నారు. ప్రిన్సిపాళ్లు చాణక్య, భారతి, లత, అధ్యాపకులు ఏకాంబరాచారి, అమ్ముదేవి, సృజన, విద్యార్థులు పాల్గొన్నారు.

రమాదేవి దంపతులను సత్కరిస్తున్న అధికారులు, అధ్యాపకులు

వధూవరులతో ఎమ్మెల్యే భానుప్రకాష్

నూతన వధూవరులకు శుభాకాంక్షలు

వెదురుకుప్పం, న్యూస్‌టుడే: వెదురుకుప్పం మండలంలోని రెడ్డేపల్లెకు చెందిన తెదేపా సీనియర్ నేత, పారిశ్రామిక వేత్త రావిళ్ల చిన్నస్వామినాయుడు కుమార్తె బిందు, అల్లుడు భరత్ సాయికృష్ణ వివాహం తిరుపతిలో జరిగింది. చిత్తూరు జిల్లా నుంచి పలువురు ఎమ్మెల్యేలు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. జీడీనెల్లూరు, నగరి, సత్యవేడు, పలమనేరు ఎమ్మెల్యేలు థామస్, గాలి భానుప్రకాష్, ఆదిమూలం, అమరనాథరెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు రావిళ్ల దేవరాజులనాయుడు, రావిళ్ల అరుణ, గౌతమ్, మోహన్‌మురళి తదితరులు పాల్గొన్నారు.

తేజోమూర్తి పుట్టినరోజు వేడుకలు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షుడు, విజయం విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ తేజోమూర్తి పుట్టినరోజు వేడుకలు నగరంలోని విజయం ఇంజినీరింగ్ కళాశాలలో జరిగాయి. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, మదనపల్లె జ్ఞానాంబికా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ గురుప్రసాద్, కుప్పం డిల్లీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ దయానిధి, సీఎన్ఆర్ కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్‌రెడ్డి, విజయం విద్యాసంస్థల ప్రతినిధులు రాజగోపాల్, మోహన్‌నాయుడు, దేవేంద్ర తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

తేజోమూర్తిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్ తదితరులు

(c) eenadu

పలమనేరు

•పలమనేరు • కుప్పం

తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ ఉండాలి


మాట్లాడుతున్న మహర్షి సాగర్

పలమనేరు, న్యూస్‌టుడే: విద్యార్థులు కళాశాలలో చేరి తమ లక్ష్యాలను చేరే వరకు వారి తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని మోటివేషనల్ స్పీకర్ మహర్షి సాగర్ అన్నారు. సోమవారం పట్టణంలోని మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి ఏడాది విద్యార్థులకు నిర్వహించిన ఓరియంటేషన్ క్లాస్‌లో ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు, డైరెక్టర్ రాజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

మూగజీవాల దాహార్తి తీరేదెలా..?

❖ ఎల్‌నినోతో కొరవడిన నీటి వసతి ❖ పాడి రైతులకు తప్పని ఇబ్బందులు

కుప్పం, శాంతిపురం, న్యూస్‌టుడే: రామకుప్పం మండల పరిధి అటవీ సమీపంలోని నారాయణపురంలో పశువుల తాగునీటి తొట్టి ఇది. ప్రధాన రహదారి పక్కన రూ.20 వేలతో నిర్మించిన తొట్టిలో నీటి వసతి లేనందున పశువులు, గొర్రెలు తదితర మూగజీవాలకు దాహార్తి తీరని పరిస్థితి కొనసాగుతోంది.

నారాయణపురంలో నీటి వసతికి నోచుకోని తొట్టి

అడుగంటిన జలవనరులు

కుప్పం నియోజకవర్గంలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన తీవ్ర వర్షాభావం వల్ల జలవనరుల్లో నీటి వసతి కొరవడింది. నాలుగు మండలాల్లో దాదాపు 560 చెరువులు ఉండగా.. ప్రస్తుతం ఎక్కడ చూసినా బోసిపోయి కనిపిస్తున్నాయి. గతేడాది 'హంద్రీ-నీవా' జలాలతో 70 చెరువులు నిండినా.. ప్రస్తుతం వాటిలోనూ చాలా వరకు నీటి వసతి కొరవడింది. పాలారు చెక్‌డ్యాంలు, కుంటల్లోనూ నీటి జాడ కనిపించడం లేదు.

వందలాది తొట్టెలు అలంకారప్రాయం

శాంతిపురం, రామకుప్పం, గుడుపల్లె, కుప్పం మండలాల్లో గ్రామీణ ఉపాధి హామీ, మండల పరిషత్తు, వాటర్ షెడ్ ద్వారా రూ.20వేల్లో ఖర్చు చేసి తొట్టెలను నిర్మించారు. ఒక్కో తొట్టెకు రూ.20 వేలు వంతున వెచ్చించారు. నాలుగు మండలాల్లో దాదాపు 700 వరకు తొట్టెలు ఉండగా.. చాలాచోట్ల నీటి వసతికి నోచుకోలేదు. ఏళ్ల తరబడి అలంకారప్రాయమైన తొట్టెలు దుస్థితికి చేరుకున్నాయి.

రక్షిత మంచినీటి పథకాల్లో నీటి వసతి ఉన్నా..

ప్రభుత్వ రక్షిత మంచినీటి పథకాల బోర్లలో నీటి సౌకర్యం ఉన్నా.. సమీపంలోని తొట్టెల్లో నీటి వసతి సాకారం కాలేదు. కేవలం గుత్తేదారుల లాభాపేక్ష కోసం తొట్టెలను నిర్మించారని జనం ఆరోపిస్తున్నారు. అధికారుల్లో దాపురించిన నిర్లక్ష్యం ఫలితంగా.. అని మూగజీవాల దాహం తీర్చేందుకు నానా అగచాట్లు పడుతున్నామని పాడి రైతులు వాపోతున్నారు. నీటి పథకాల ట్యాంకులు, పైపులైన్ల నుంచి తొట్టెల్లో నీటి వసతికి కొద్దిపాటి నిధులను వెచ్చిస్తే సమస్య పరిష్కారం అవుతుందని అన్నదాతలు అంటున్నారు.

భవిష్యత్తు ప్రశ్నార్థకమే..!

పలమనేరు, న్యూస్‌టుడే: నియోజకవర్గ పరిధిలోని ఏ చెరువు చూసినా ఇదే తీరు. నిత్యం రాత్రి పగలు తేడా లేకుండా చెరువుల్లోని మట్టిని యంత్రాలతో తీసేస్తున్నారు. ముఖ్యంగా చెరువులోని బంకమట్టిని విచ్చలవిడిగా తరలిస్తూ పొలాలకు తోలుతున్నారు. దీంతో చెరువు రూపురేఖలు మారుతోంది. బంకమట్టి వల్ల పొలాలకు ప్రయోజనం ఉన్నా.. విచ్చలవిడి తవ్వకాల వల్ల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని ప్రజలు పేర్కొంటున్నారు.

కుర్రపల్లెలో యంత్రాలతో మట్టితవ్వకాలు

బంకమట్టి ప్రయోజనాలు ఇవీ..

చెరువులోని బంకమట్టిలో నత్రజని, భాస్వరం, పొటాష్, జింక్, బోరాన్ తదితర ముఖ్య పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఈ మట్టిని పొలాలకు తోలడం వల్ల భూమి భౌతిక గుణాలు మెరుగుపడి, రసాయనిక ఎరువుల మీద ఆధారపడటం తగ్గుతుంది. భూమి సారవంతంగా ఉంటుంది. పంట దిగుబడి కూడా ఎక్కువగా ఉంటుంది. అంతే కాకుండా తేమను ఎక్కువ సేపు నిలుపుకొనే గుణాన్ని కలిగి ఉంటుంది. పంటలకు ఎక్కువ కాలం నీరు అందుతుంది.

మనకు కలుగుతున్న నష్టం ఏంటంటే..!

ప్రస్తుతం చెరువుల్లోని మట్టిని తీసేయడంతో.. భవిష్యత్తులో కురిసిన వర్షపు నీరు ఎక్కువ కాలం నిల్వ ఉండని పరిస్థితి ఉంటుంది. తద్వారా భూమిలోకి ఇంకిపోతుంది. ముఖ్యంగా మట్టి కోసం 20 నుంచి 30 అడుగుల లోతు తవ్వేయడంతో పశువులు నీరు తాగలేకపోతున్నాయి. తవ్వకాలతో ఏర్పడిన గుంతలు చూస్తే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇక పశువులు అందులో దిగితే మృత్యువాత పడినట్లే. ఈ పరిస్థితి ఏ ఒక్క చెరువులోనో ఒక ప్రాంతంలోనో కాదు. మొత్తం నియోజకవర్గం పరిధిలోని 1,550 చిన్న, పెద్ద చెరువుల్లో తవ్వకాలు సాగుతున్నాయి. చెరువులను కాపాడుకోకుంటే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలపై దయ చూపాలి మీరు..!

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: సమస్యలతో నిత్యం సతమతమవుతున్నాం. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదు. మా సమస్యలు ఆలకించి దయ చూపాలంటూ వినతి దారులు అధికారులను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కడా ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుంచి కడా పీడీ వికాస్ మర్మత్ వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి ఆయా శాఖ అధికారులను ఆదేశించారు. మొత్తం 81 వినతులు అందినట్లు అధికారులు చెప్పారు.

వినతులు స్వీకరిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

ఉపాధ్యాయులు లేరు

కుప్పం మండలం రాగిమానుమిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో 1 నుంచి 10వ తరగతి వరకు 107 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 1 నుండి 5వ తరగతి వరకు మోడల్ ప్రాథమిక పాఠశాలగా మార్చారు. కానీ, ఒక్క ఉపాధ్యాయుడు కూడా లేరు. ఇటీవల అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కరికి కూడా ఉద్యోగం ఇవ్వలేదు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలి. - అక్బర్, అతీక్, రాగిమానుమిట్ట

వితంతు పింఛన్ ఇప్పించండి

నా భర్త గుండెపోటుతో మరణించారు. కుటుంబ పోషణ భారంగా మారింది. గతంలో గురుకుల పాఠశాలలో వంట మనిషిగా పని చేసి ప్రస్తుతం నిలిపివేశారు. వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటే తిరస్కరణకు గురైంది. వితంతు పింఛన్ ఇప్పించి ఆదుకోవాలి. - ప్రభమ్మ, కృష్ణదాసనపల్లె, కుప్పం

అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు..

దారి సమస్య పరిష్కారంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదంటూ సిరిగిరిపల్లెకు చెందిన కుమదవల్లి, కొత్తపేటకు చెందిన కుమరమ్మ నిరసన వ్యక్తం చేశారు. అలాగే తమ ఇంటిని బంధువులు బ్యాంకులో తమకు తెలియకుండా తాకట్టు పెట్టారని యామనూరుకు చెందిన జయంతి నిరసన తెలిపారు. కడ పీడీ వారితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

12 ఏళ్లుగా పోరాడుతున్నా

నా భర్త ఇబ్రహీం కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. 2013లో గూళపల్లి వద్ద ట్రాక్టర్ ఢీకొంది. అప్పుడు పోలీసులకు ఫిర్యాదు చేస్తే రామకుప్పం మండల పరిషత్‌కు చెందిన ట్రాక్టర్‌గా గుర్తించారు. నా భర్త చికిత్స పొందుతూ మరణించాడు. 12 ఏళ్లుగా న్యాయం కోసం పోరాడుతున్నా ఎలాంటి ఫలితం లేదు. - రహజాన్, గూళపల్లె, రామకుప్పం

రోగులకు సేవ చేయడం అదృష్టం

నర్సింగ్ విద్యార్థినులతో కళాశాల యాజమాన్యం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: నర్సింగ్ వృత్తి కేవలం ఉద్యోగం మాత్రమే కాదని.. రోగులకు సేవ చేయడం అదృష్టంగా భావించాలని బీసీఎన్ విద్యాసంస్థల అధినేత బీసీ నాగరాజ్, బెంగళూరు ఎస్‌ఏబీవీ కళాశాల అల్లైడ్ హెల్త్ సైన్సెస్ వైద్యురాలు దివ్యరాణి అన్నారు. స్థానిక కుప్పం నర్సింగ్ కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. నర్సింగ్ విద్యార్థులు సేవా ప్రమాణాలను పాటిస్తూ, రోగుల పట్ల అంకితభావంతో పని చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. నర్సింగ్ వృత్తి ప్రాధాన్యం, సేవా విలువలు, వృత్తిపరమైన బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కేఈసీ వైస్ ఛైర్మన్ సునీల్‌రాజ్, కార్యదర్శి సాగర్‌రాజ్, ప్రిన్సిపల్ విమల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచాలి

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక కడా కార్యాలయంలో సోమవారం కుప్పం మండల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ఎంపికైన 37 మంది అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం పీఏ శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా పారదర్శకంగా మెరిట్ ఆధారంగా నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజ్‌గోపాల్, ధనశేఖర్, హైదర్ అలీ, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, విద్యాశాఖాధికారిణి కుమారి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఎం పీఏ శ్రీకాంత్

ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న మధుసూదననాయుడు

ఎమ్మెల్యేని కలిసిన మధుసూదన్‌నాయుడు

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని పుంగనూరు తెదేపా ఇన్‌ఛార్జి మధుసూదననాయుడు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఆయన నూతనంగా నియమితులైన విషయం విదితమే. ఈ సందర్భంగా ఎమ్మెల్యేని ఆయన కలిసి పలు విషయాలపై చర్చించారు. నాయకులు దేశాద్రిప్రకాష్, మధు, జంపాల మోహన్‌నాయుడు, బాబునాయుడు, రాజు, సందీప్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన ఏఈకి సత్కారం

పలమనేరు, న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ పీఐయూ సబ్ డివిజన్‌లో ఏఈగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన మాధవనాయుడును ఏపీ ఎన్జీవో సభ్యులు సత్కరించారు. సోమవారం పట్టణంలోని ఎన్జీవో హోమ్‌లో అభినందన సభ ఏర్పాటు చేశారు. క్రమశిక్షణ, బాధ్యత, నాణ్యత ఆయన ప్రత్యేకతలని వక్తలు అభిప్రాయపడ్డారు. మాధవనాయుడు దంపతులను శాలువా కప్పి జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో డీఈఈ జయప్రకాష్, ఆర్డీఐఈ మహేష్, అధికారులు గౌస్, రాజీవ్, గాయత్రి, గజేంద్ర పాల్గొన్నారు.

మాధవనాయుడు దంపతులను సత్కరిస్తున్న ఏపీఎన్జీవో సభ్యులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కరపత్రాలు పంపిణీ చేస్తున్న కిషోర్‌గౌడ్

బైరెడ్డిపల్లె: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని మండల తెదేపా అధ్యక్షుడు కిషోర్‌గౌడ్ అన్నారు. సోమవారం ఇంటింటికీ తెదేపాలో భాగంగా బైరెడ్డిపల్లెలో పర్యటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో భువనచంద్రగౌడ్, అరుణ్, పళణి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మలుపులో.. పోతున్నాయ్ ప్రాణాలు

పలమనేరు ఆర్టీసీ బస్టాండులోకి వెళ్లే దారి ప్రమాదకరంగా మారింది. నాలుగో నంబరు జాతీయ రహదారి నుంచి బస్టాండ్‌లోకి వచ్చే దారి ఇరుకుగా ఉండటంతో ఈ పరిస్థితి ఉంది. స్థానిక టవర్‌క్లాక్ వద్ద మలుపు తిరిగే సమయంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇక్కడ రెండు నెలల వ్యవధిలో ఇద్దరు బస్సుల కింద పడి మృతి చెందారు. మున్సిపల్, ఆర్టీసీ అధికారులు స్పందించి ప్రమాద నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, పలమనేరు

ప్రజాధనం రాళ్ల పాలు

వైకాపా ప్రభుత్వంలో రీసర్వే చేసిన గ్రామాల్లో పొలం గట్ల సరిహద్దుల్లో నాటేందుకు తెచ్చిన సర్వే రాళ్లు నిరుపయోగంగా మారాయి. ప్రజాధనంతో సరిహద్దు రాళ్లపై జగన్ పేరును చెక్కించి రైతుల పొలాల్లో పాతి పెట్టారు. వైకాపా ప్రభుత్వంలో రీసర్వే పూర్తైన గ్రామాల్లో సర్వే రాళ్లు నాటి మిగిలిన వాటిని ఎక్కడికక్కడ వదిలేశారు. అలా వదిలేసిన సరిహద్దు రాళ్లను స్థానికులు తమ అవసరాలకు వినియోగిస్తున్నారు.- న్యూస్‌టుడే, బైరెడ్డిపల్లె

దుర్వాసన.. భరించలేకున్నాం..!

బైరెడ్డిపల్లె-పుంగనూరు రహదారిలో సర్కారుతోపు, కామినాయనిపల్లె చెరువు కట్ట వద్ద కోళ్ల వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతోంది. స్థానిక మాంసం విక్రయ దుకాణదారులు కోళ్ల వ్యర్థాలను సంచుల్లో మూట కట్టి రహదారి పొడవునా పడేస్తున్నారు. దీంతో పరిసరాలు అధ్వానంగా ఉంటున్నాయి. రహదారి పక్కన కోళ్ల వ్యర్థాలు పడేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, బైరెడ్డిపల్లె

చెట్లు పెరిగి.. సూచిక కనుమరుగై

పుంగనూరు-బైరెడ్డిపల్లె ప్రధాన మార్గంలో రాజుపల్లె సమీపంలో రోడ్డు ఆనుకుని చెట్లు పెరిగిపోవడంతో ఇక్కడ ఏర్పాటు చేసిన సూచిక కనిపించక ప్రమాదాలకు నిలయంగా మారింది. వాహన చోదకులకు మలుపు ఉన్నట్లు తెలిసేలా ర.భ. అధికారులు సూచిక ఏర్పాటు చేశారు. మలుపులో చెట్ల మధ్యలో ఉన్న సూచిక చోదకులకు సక్రమంగా కనిపించడం లేదు. అధికారులు చెట్లను తొలగించేందుకు చర్యలు చేపట్టాలి.
- న్యూస్‌టుడే, పెద్దపంజాణి

వినియోగానికి దూరమై.. దుస్థితికి చేరువై..!

శాంతిపురం మండలం చెంగుబళ్ల పంచాయతీ శెట్టిబళ్లలోని సామాజిక భవనం వినియోగానికి దూరమై.. దుస్థితికి చేరువవుతోంది. భవనం చుట్టూ ముళ్లపొదలు, పిచ్చిమొక్కలతో విషసర్పాలకు ఆవాసంగా మారింది. అధికారులు స్పందించి భవనాన్ని కొద్దిపాటి మరమ్మతులతో వినియోగానికి తీసుకొస్తే.. స్థానికంగా సామాజిక కార్యకలాపాలకు వేదికగా నిలుస్తుందని స్థానికులు అంటున్నారు. - న్యూస్‌టుడే, శాంతిపురం

పంచాయతీల స్థానంలో స్వర్ణ గ్రామాలు

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: ప్రభుత్వం నూతనంగా గ్రామ పంచాయతీల పేర్ల స్థానంలో స్వర్ణ గ్రామాలుగా మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వం సరఫరా చేసిన బోర్డులను ఆయా సచివాలయాలకు ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం ఎంపీడీవో బాలాజీ.. స్వర్ణ కొళత్తూరు బోర్డు ఏర్పాటును పరిశీలించారు. మండలంలోని అన్ని సచివాలయాలకు నూతనంగా వచ్చిన బోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీవో చెప్పారు.

ఐక్యతతోనే భాష మనుగడ.. కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: ఐక్యతతోనే భాష మనుగడ సాధ్యమని వీసీ ఆచార్య మల్లయ్య పేర్కొన్నారు. ద్రవిడ విశ్వవిద్యాలయంలో ప్రచురణల విభాగం ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి జయంతిని సోమవారం నిర్వహించారు. ఆచార్యులు శారద, కేశవమూర్తి, యశోద పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు.. పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని సంతగేటులోని వినాయకస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. సంకటహర చతుర్థి సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, అలంకరణ చేశారు. స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజించారు.

పరిమి శ్రీరామనాథ్‌కు సాహితీస్ఫూర్తి పురస్కారం

శ్రీరామనాథ్

పలమనేరు, న్యూస్‌టుడే: రచయిత జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి తల్లిదండ్రుల పేరిట ఏర్పాటు చేసిన జొన్నవిత్తుల సాహిత్య స్ఫూర్తి పురస్కారాన్ని యువకవి పరిమి శ్రీరామనాథ్‌కు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. సెప్టెంబరు 6న పట్టణంలోని కళా మందిరంలో పురస్కారాన్ని అందజేయనున్నట్లు రచయిత పలమనేరు బాలాజీ తెలిపారు.

వైభవంగా ముగింపు ఉత్సవాలు

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని రాఘవేంద్ర స్వామి ఆలయంలో ఆరాధనోత్సవాల ముగింపు సోమవారం ఘనంగా జరిగింది. ఈ నెల 29వ తేదీ నుంచి 31 వరకు చేపట్టిన ఉత్సవాల్లో చివరి రోజు సోమవారం స్వామివారిని రథంలో ఉంచి ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కుప్పంలో 30 పోలీసు యాక్టు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కుప్పం పోలీసు సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుందని డీఎస్పీ పార్థసారథి తెలిపారు. సెప్టెంబరు 30వ తేదీ వరకు పోలీసు యాక్టు అమలులో ఉంటుందన్నారు. కుప్పం అర్బన్, గుడుపల్లె, రాళ్లబూదుగూరు, రామకుప్పం పోలీసు స్టేషన్ పరిధిలో పోలీసు యాక్టు అమలులో ఉంటుందని తెలిపారు. సభలు, సమావేశాలు నిర్వహించేందుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
శాంతిపురం: 93918 30897

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: ఆర్‌కేఎం నగర్‌లో మురుగు కాలువలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో మురుగు పొంగి రోడ్లపై ప్రవహిస్తోంది. **- భాగ్యరాజ్**

సమాధానం: కాలువలను నిర్మించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాసరావు, కమిషనర్**

గుడుపల్లె, న్యూస్‌టుడే: సమస్య: గుడుపల్లె పంచాయతీ కాడేపల్లె అంగన్‌వాడీ కేంద్రం పరిసరాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. దీంతో దోమల బెడద ఎక్కువైంది.
- మల్లిక, స్థానికురాలు

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులతో పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.
- రాధాకృష్ణ, ఎంపీడీవో

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కుప్పం 33/11కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో సోలారు విద్యుత్తు పనుల నిమిత్తం లైను లాగుతుండటంతో మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్, ఎండీ సోమశేఖర్ తెలిపారు. కుప్పం పట్టణం, గ్రామీణ పరిధిలో సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నూతనంగా ప్రారంభించిన సీటీస్కాన్ యూనిట్‌లో ఖాళీగా ఉన్న రేడియోగ్రాఫర్, సీటీస్కాన్ టెక్నీషియన్ పోస్టుకు తాత్కాలిక ప్రాతిపదికన పని చేయుటకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయకుమారి తెలిపారు. మరిన్ని వివరాలకు ఆస్పత్రిలో సంప్రదించాలని కోరారు.

వర్షం రాకకు ప్రత్యేక పూజలు

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: మండలంలోని రాయలపేట పంచాయతీ గంకొండపై వెలసిన కాలభైరవస్వామి ఆలయంలో సోమవారం వర్షం కోసం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రతిఏటా వర్షాలు కురవాలని కోరుతూ గంగవరం, పెద్దపంజాణి మండలాలకు చెందిన ప్రజలు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇక్కడ స్వామివారికి జలంతో అభిషేకం చేసిన సందర్భంగా ఎన్ని బిందెలు పోస్తే నీరు బయటకు వస్తే అన్ని రోజుల్లో వర్షం పడుతుందనేది ఇక్కడి ప్రజలు విశ్వాసం. పూజల అనంతరం అన్నదానం నిర్వహించారు.

ప్రత్యేక తరగతులు ప్రారంభం

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: ద్రవిడ విశ్వవిద్యాలయంలో యూజీసీ శిక్షణ కేంద్రం సమన్వయకర్తలు శోభారాణి, హర్షవర్ధన్ ఆధ్వర్యంలో యూజీసీ-నెట్, సీఎస్ఏటీకు సంబంధించి ప్రత్యేక తరగతులను వీసీ ఆచార్య మల్లయ్య సోమవారం ప్రారంభించారు. శిక్షణ కోసం 70 మంది విద్యార్థులు ఎంపిక చేసుకున్నట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి అకడమిక్ డీన్ కేశవమూర్తి పాల్గొన్నారు.

శుద్ధజలం అందని దైన్యం

కల్లూరు హైస్కూల్‌లో ఆర్వో ప్లాంటు

కల్లూరు, న్యూస్‌టుడే: విద్యార్థులకు రక్షిత తాగునీరు అందించాలన్నా లక్ష్యంతో పాఠశాలల్లో రూ.లక్షలు వెచ్చించి శుద్ధజల యంత్రాలు ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ సరిగా లేక ఆదిలోనే మరమ్మతులకు గురై మూలనపడ్డాయి. దీంతో విద్యార్థులకు శుద్ధజలం అందడం లేదు. పులిచెర్ల మండలంలోని కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో వైకాపా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు పని చేయకపోవడంతో పక్కన పడేశారు. కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకం కింద కొత్త ఆర్వోప్లాంటు పాఠశాలకు మంజూరైంది. ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేసి సుమారు నెలరోజులు అవుతున్నా అందుబాటులోకి రాలేదు.

నిపుణులు రావాల్సి ఉంది..

పాఠశాలలో 607 మంది విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు ఇళ్ల నుంచి ప్లాస్టిక్ సీసాల్లో నీరు తెచ్చుకుని దాహార్తి తీర్చుకుంటున్నారు. ఈ విషయమై పాఠశాల హెచ్ఎం శ్రీవాణిని వివరణ కోరగా.. కొత్త ఆర్వో ప్లాంటుకు కనెక్షన్ కోసం చిత్తూరుకు చెందిన సంస్థ సాంకేతిక నిపుణుల కోసం ఎదురు చూస్తున్నామన్నారు. దీంతో బోరు బావి నీటిని అందిస్తున్నామని చెప్పారు.

హక్కులు-చట్టాలపై అవగాహన అవసరం

శెట్టిపల్లె,(గుడుపల్లె),న్యూస్‌టుడే: మండల పరిధి శెట్టిపల్లె పంచాయతీ కేంద్రం వేణుగోపాలస్వామి ఆలయం ఆవరణలో సోమవారం తహసీల్దారు సీతారాం అధ్యక్షతన పౌరహక్కుల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా మండల అధికారులు పాల్గొని ప్రసంగించారు. ప్రధానంగా కుల వివక్షత, అంటరానితనం, బాల్య వివాహాల నిర్మూలనపై సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. పేదరిక నిర్మూలనలో భాగంగా రైతు సంక్షేమ పథకాల మంజూరులో ఎస్సీ, ఎస్టీల కుటుంబాలకు ప్రభుత్వం కల్పించిన ప్రాధాన్యంను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి జయలక్ష్మి కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీనివాసులు, సురేష్‌బాబు, కృష్ణమూర్తి, లక్ష్మణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు సీతారాం

ఏ దారి ఎటు పోతుందో..?

కూడలిలో ఊర్లను తెలిపే సూచిక బోర్డు లేకపోవడంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఎటు వెళ్లాలో పలమనేరు మండలంలోని కల్లాడు క్రాస్ వద్ద ప్రజలు, ప్రయాణికులు తికమక పడుతున్నారు. మూడు రోడ్ల కూడలి వద్ద ఏ దారి ఎటు పోతుందో ఎవరికీ తెలియడం లేదు. ఇక్కడ సూచిక బోర్డు లేకపోవడంతో జనాలు ఇబ్బంది పడుతున్నారు. గొల్లపల్లె నుంచి ఇక్కడికి చేరుకున్న వారు ఒకవైపు వెళ్తే పలమనేరు, మరోవైపు వెళ్తే మాదిగకల్లాడు గ్రామానికి చేరుకుంటారు. అయితే ఆ దారి ఏదో తెలిపే బోర్డులు లేవు. సంబంధిత అధికారులు స్పందించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
- న్యూస్‌టుడే, పలమనేరు

(c) eenadu